## క్లుప్తంగా

### ‘తహసీల్దార్ సేవలు మరువలేనివి’



సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

**లింగాపూర్:** తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చేతి పంపునకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న అధికారి

**లింగాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోక తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్య తెలుసుకున్న పంచాయతీ అధికారి రజనీకాంత్ సోమవారం చేతిపంపునకు మరమ్మతులు చేపట్టారు.

### ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

**లింగాపూర్:** మండలంలోని రామునాయక్‌తండా గ్రామానికి చెందిన జాదవ్ భీమ్‌రావ్-విజేత అనే దంపతులు అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇద్దరు కుమారులకు రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఆర్థికసాయం రూ.10వేలు అందజేశారు. సభ్యులు షేక్‌రఫీక్, షేక్ బబ్లూ, పవార్ రామారావ్, నాందేవ్, పవార్ శేఖర్, దవీత్ తదితరులు పాల్గొన్నారు.

### ‘శోభాయాత్ర జయప్రదం చేయండి’

**ఆసిఫాబాద్‌అర్బన్:** శ్రీరాముడి ప్రియ భక్తుడైన శ్రీ ఆంజనేయస్వామి శోభాయాత్రను జనవరి 8వ తేదీన ఉదయం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి జన్కాపూర్ కోదండ రామాలయం వరకు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భజన కమిటీ చైర్మన్ దురిశెట్టి వెంకటాచారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మహోన్నత కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 1 గంటకు మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

### చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

**ఆసిఫాబాద్‌అర్బన్:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో గాలిపటాలు ఎగురవేసేందుకు ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతామని పేర్కొన్నారు. నిషేధిత మాంజాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### పరామర్శ




పరామర్శిస్తున్న సుధాకర్ రావు

**బెజ్జూర్:** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల రామయ్యను మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు ఆసుపత్రిలో సోమవారం పరామర్శించారు. కరీంనగర్ పట్టణంలోని ప్రతిమా ఆస్పత్రిలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వసీఉల్లా ఖాన్, ఎల్కరి సంజు, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, మోహన్, ప్రవీణ్ ఉన్నారు.

### రేపు వాసవీ మందిరంలో పడిపూజ

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో బుధవారం సాయంత్రం 7 గంటలకు అర్చక సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# భక్తుల కొంగుబంగారం జగదాంబదేవి



ముస్తాబైన జగదాంబ దేవి ఆలయం

- జాతరకు ఏర్పాట్లు పూర్తి
- జనవరి 1 నుంచి ప్రారంభం
- 15 రోజులపాటు ఉత్సవాలు



ఆలయంలోని దేవి విగ్రహం

**లింగాపూర్:** మండల కేంద్రంలోని జగదాంబ దేవి ఆలయంలో ఏటా జరిగే జాతర ఉత్సవాలకు అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జగందాంబ దేవి జాతర ఉత్సవాలను జనవరి 1 నుంచి 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 1వ తేది సాయంత్రం 5 గంటలకు భజన, సంకీర్తనలతో ఆలయ పూజారి మంగులాల్ మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. గత 50 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, జివితీ, కిన్వట్, చంద్రపూర్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

**పుష్య అమావాస్య మాసంలో..**

జగదాంబదేవి జాతరను ఏటా పుష్య అమావాస్య మాసంలో నిర్వహిస్తారు. జాతర నిర్వహించేందుకు చరిత్రలో ఒక ప్రధాన కారణం ఉన్నట్లు పెద్దలు చెబుతుంటారు. వారి కథనం ప్రకారం.. 1970 దశకంలో లింగాపూర్‌లో నివాసం ఉన్న ఆదివాసీల పూరి గుడిసెలు ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రజలకు వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. 1974లో బంజారాల కుల గురువు పద్మశ్రీ డా.రామారావు మహరాజ్ మండలంలో సందర్శించారు. ప్రజల్లో మనో ధైర్యాన్ని నింపడంతో పాటు వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ జగదాంబ దేవి ఆలయంలో పూజలు చేసి జాతర ప్రారంభించారు. దీంతో మండలంలో ప్రజల కష్టాలు తొలగి సుఖంగా జీవించారని, ఆ నమ్మకంతోనే ఏటా జాతర నిర్వహిస్తున్నట్లు పెద్దలు పేర్కొంటున్నారు.

**క్రీడా పోటీలు ప్రారంభం..**

జాతర సందర్భంగా నిర్వాహకులు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. వాలీబాల్, కబడ్డీ, తాడు ఆట, కుస్తీ వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

### గ్రామస్తుల సహకారంతోనే..



మండల కేంద్రంలో నిర్వహించే జగదాంబ దేవి జాతరను గ్రామస్తుల సహకారంతో ఏటా పుష్య అమావాస్య రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. భజనలు, కీర్తనలతో జాతర ప్రారంభమవుతుంది. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివస్తుంటారు.

– రామావత్ మంగులాల్ మహరాజ్, ఆలయ పూజారి

### బందోబస్తు నిర్వహిస్తున్నాం..



జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశాం. శాంతి భద్రతలను రక్షించేందుకు బందోబస్తు ఏర్పాటు చేశాం. జాతరను శాంతియుతంగా జరుపుకునేందుకు గ్రామస్తులు, భక్తులు సహకరించాలి.

– గంగన్న, ఎస్సై

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దహెగాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997 -98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువు జయరాజ్‌ను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేశ్, తోట రాజు, రాపర్తి శ్రీను, గందె శోభ, విఘ్నేశ్, మల్లేశ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



పిండి గిర్ని కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

**వాంకిడి:** స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం సారయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన మహాత్మ లక్ష్మికి పీఎంఎఫ్ఎంఈ పథకం కింద మంజూరైన పిండి గిర్ని కేంద్రాన్ని బ్యాంకు సిబ్బంది, ఐకేపీ అధికారులతో కలిసి ప్రారంభించారు. రూ.2.16 లక్షలతో మంజూరైన పిండి గిర్ని కేంద్రానికి ప్రభుత్వం 30 శాతం సబ్సిడీ కల్పిస్తుందన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నంద కిశోర్, ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, ఏపీఎం మహేశ్, సీసీలు విఠల్, భీంరావు, వేణుగోపాల్, సునీత, కవిత పాల్గొన్నారు.

## శౌర్యా విజయ్ దివస్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

**కౌటాల:** భీమా కోరేగావ్ శౌర్యా విజయ్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిర్పూర్ నియోజకవర్గ బౌద్ధ సమాజ్ సంఘం అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బుద్ధవిహార్ ఆవరణలో బౌద్ధ సమాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 1న ఉదయం 10.30 గంటలకు కౌటాల బుద్ధ విహార్‌లో భీమా కోరేగావ్ శౌర్యా విజయ్ దివస్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ గ్రామంలో కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహించి అనంతరం కౌటాలలో నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహర్ కులస్తులు పాల్గొనాలని కోరారు. నాయకులు బండు, దిలీప్, మధుకర్, జీవన్, పత్రు, రవి పాల్గొన్నారు.

# నీటి సమస్య పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో ఎనోలి కొలాంగూడ గ్రామస్తులు

**వాంకిడి:** ఉన్న ఒక్క బోరింగు పాడైపోయి సరిగ్గా నీరు రావడం లేదు.. మిషన్ భగీరథ నీటి చుక్కా లేదు.. గుక్కెడు నీళ్లు తాగాలన్నా, అవసరాలకు వాడుకోవాలన్నా వేకువ జామున మూడు గంటలకు నిద్ర లేచి బోరింగును దంచి కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొలాం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వాంకిడి మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామానికి చెందిన గిరిజన యువకులు సోమవారం ఏడాదిగా ఎదుర్కొంటున్న నీటి గోసను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వారు విలేకరులతో మాట్లాడుతూ గత ఎనిమిది నెలల క్రితం కలెక్టర్ గ్రామానికి వచ్చి భగీరథ నీటి సమస్యపై ఆరా తీశారని, సమస్య పరిష్కరించడంలో భాగంగా సమీపంలోని భీంపూర్ గ్రామంలో ఒక హెచ్‌పీ మోటరు సైతం బిగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కానీ లో వోల్టేజీ కారణం చూపుతూ మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేకించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిందిగా సూచిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కడం లేదన్నారు. అనంతరం సీపీఐ(ఎం) నాయకుల ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వీటీడీఏ ఉపాధ్యక్షుడు సిడం పగ్గు, సీపీఎం నాయకులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, కార్తిక్, రాజేందర్, యువకులు గజ్జు, జైతు, భీంరావు, అన్నిగా, మారుతి తదితరులు ఉన్నారు.

# కోనప్ప చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దరోగపల్లి గ్రామస్తులు

**పెంచికల్‌పేట్:** మండలంలోని దరోగపల్లి బస్టాప్ నుంచి దరోగపల్లికి బీటీ రోడ్డు పూర్తి కావడంతో సోమవారం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ఏడాది ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు చేపట్టలేదని, ఇటీవల రోడ్డు పనులు పూర్తయ్యాయని గ్రామస్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ దేవాజీ, గ్రామస్తులు రాజయ్య, బాపు, పెంటయ్య, ఇస్తారి, శ్రీనివాస్, బండన్న, సంజీవ్, వికాస్, గంగయ్య, శంకర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి’

**ఆసిఫాబాద్:** నూతన సంవత్సర వేడుకలు జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ బుద్దే రవీందర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31న జిల్లా కేంద్రంలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, సాయంత్రం 7 గంటల నుంచి 50 మంది పోలీసులతో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారుల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**దహెగాం:** పాత సంవత్సరం ముగింపు పలికి కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నందున ప్రజలు వేడుకలను సంతోషాల మధ్య జరుపుకోవాలని ఎస్సై కందూరి రాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ యువత వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు.

**లింగాపూర్:** మండలంలో కొత్త సంవత్సరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సోమవారం ఎస్సై గంగన్న తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి 7 గంటల నుంచి గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో డీజేలు వినియోగించడం నిషేధించామని పేర్కొన్నారు.

**బెజ్జూర్:** ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. డీజే చప్పుళ్లు నిర్వహించకూడదని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

**కెరమెరి:** ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించాలని ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

**ఆసిఫాబాద్‌రూరల్:** తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నేరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వారు చేస్తున్న సమ్మె 21వ రోజుకు చేరుకుంది. ఆమె మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య, ఆనందర్ రావు, లత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ‘అమిత్‌షా క్షమాపణ చెప్పాలి’

**ఆసిఫాబాద్:** మనువాద ఆలోచనలు మానుకొని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం నాయకులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ సకల జనులకు మార్గదర్శి అంబేద్కర్ అని కొనియాడారు. సంఘం ప్రతినిధులు ముంజం ఆనంద్ కుమార్, కార్తీక్, టీకానంద్, కృష్ణమాచారి, తిరుపతి పాల్గొన్నారు.

### ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వినతి

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ వ్యాయామం చేసేందుకు వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని, జన్కాపూర్ మైదానంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. బస్టాండ్, రాజంపేట, జన్కాపూర్ కేంద్రంగా ఓపెన్ జిమ్‌లు ప్రారంభించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టీకానంద్, కార్తీక్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

**రెబ్బెన:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు దుర్గం మహేశ్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు పూదరి హరీశ్ అన్నారు. సోమవారం మండలంలోని తుంగెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనాల నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు నిధులను సైతం కేటాయించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డోంగ్రి మల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల గదుల నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ సంతోష్

**రెబ్బెన:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న గదుల కొరత సమస్య తీరుతుందని మాజీ జెడ్పీటీసీ వేమునూర్ల సంతోష్ అన్నారు. కళాశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులను సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ సమయంలో అప్పటి ఎమ్మెల్యే ఆత్రం సక్కు కృషితో కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 33లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ప్రస్తుతం గదుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థులు ఎదుర్కొంటున్న గదుల కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈ కిరణ్, కాంట్రాక్టర్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ‘సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం’



మాట్లాడుతున్న సతీశ్

**కెరమెరి:** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్ కుమార్ అన్నారు. 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అని, 1970లో కేరళలోని త్రివేండ్రంలో ఏర్పడిందని తెలిపారు. మండల నాయకులు సంగీత, కిరణ్, పవన్, గీతాంజలి, శిరీష, సౌమ్య, కృష్ణ, కవిత, దీపిక, జంగుబాయి మాయాబాయి, ప్రమీల, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

### షోకాజు నోటీసులు ఉపసంహరించుకోవాలి

**ఆసిఫాబాద్‌రూరల్:** ఎంఈవోలకు ఆర్‌జేడీ ఇచ్చిన షోకాజు నోటీసులు ఉపసంహరించుకోవాలని సోమవారం పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందించారు. ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు 20 రోజులుగా సమ్మెలో ఉండటంతో బిల్లులు, రికార్డులు ఉన్నతాధికారులకు ఇవ్వలేకపోతున్నారని తెలిపారు. దీనిపై వరంగల్ ఆర్‌జేడీ జిల్లాలో పనిచేస్తున్న ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, లక్ష్మణ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

### పాదయాత్ర భక్తులకు అల్పాహారం పంపిణీ

**చింతలమానెపల్లి:** చపరాడకు పాదయాత్ర నిర్వహిస్తున్న భక్తులకు మండలంలోని ప్రజలు సోమవారం స్వాగతం పలికారు. ఏటా మంచిర్యాల జిల్లా వేమనపల్లి, కన్నెపెల్లి, భీమిని మండలాల నుంచి నూతన సంవత్సరం సందర్భంగా పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి చపరాడ ప్రశాంతధాం ఆలయానికి చేరుకుని ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా రుద్రాపూర్, బాలాజీఅనుకోడ, రవీంద్రనగర్, బాబాపూర్ గ్రామాలలో గ్రామస్తులు అరటిపండ్లు, భోజనం, అల్పాహారం పంపిణీ చేశారు. పాదయాత్ర నిర్వహిస్తున్న భక్తులు కార్తీక్ మహరాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘీభావ దినానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కాపాడుకునేందుకు కార్మికులు, ఇంజినీర్లు మంగళవారం నిర్వహించే సంఘీభావ దినానికి మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డి దారిన ప్రైవేటీకరించే ప్రయత్నాలు కేంద్రం చేస్తుందని ఆరోపించారు. కృష్ణమాచారి, పద్మ, సమ్మయ్య, రాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### ఎస్టీ రిజర్వేషన్ ప్రకటించాలని వినతి

**బెజ్జూర్:** రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని లంబడిగూడలో జనాభా, ఓటర్ల పరంగా సర్పంచ్ కోసం ఎస్టీ రిజర్వేషన్ ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు భూక్యా సంతోష్ నాయక్, ఆత్రం సకారాం, కుమురం పొట్టి, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.